క్లుప్తంగా

ఎమ్మెల్యే ఆర్కే ఆర్థిక సాయం

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని మంచికలపూడిలో మృతి చెందిన వృద్ధుని అంత్యక్రియలకు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) అందించిన రూ.10వేల ఆర్థిక సాయాన్ని జెడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణ ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు యార్లగడ్డ వెంకటేశ్వరరావు(చిన్నా), దాసరి వీరయ్య, ఆత్మకూరి నాగేశ్వరరావు, పులి బాలస్వామి, కుక్కమళ్ల జనార్దనరావు, అద్దేపల్లి జయరాజు, చలపాటి చిట్టియ్య పాల్గొన్నారు.
దుగ్గిరాల మండల పరిధిలోని కంఠంరాజు కొండూరులో ప్రమాదవశాత్తు మృతి చెందిన బాలుడి కుటుంబానికి ఎమ్మెల్యే ఆర్కే సహకారంతో ఆదివారం రూ.20వేల ఆర్థిక సహాయాన్ని జెడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణ అందించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ బాజీ, సర్పంచి ఉన్నం రూనీస్, ఉప సర్పంచి ఎం. నాగలక్ష్మి, ఎంపీటీసీ సభ్యుడు షేక్ సుభాని, వైఎస్సార్ సీపీ నాయకులు దాసరి వీరయ్య, గుమ్మడి తంబిరాజు, వసంతరావు, శేషయ్య పాల్గొన్నారు.

విజయకీలాద్రిపై సుదర్శన హోమం



తాడేపల్లి రూరల్: ఎంటీఎంసీ పరిధిలోని సీతానగరం విజయకీలాద్రి దివ్యక్షేత్రంపై ఆదివారం సర్వరక్షాకర సుదర్శన హోమాన్ని నిర్వహించారు. జీయర్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ నిర్వాకులు పురాణం వెంకటాచార్యులు మాట్లాడుతూ జ్యేష్ఠ అమావాస్యను పురస్కరించుకుని లోక కల్యాణార్థం సర్వరక్షాకర సుదర్శన హోమాన్ని నిర్వహించినట్లు చెప్పారు. భక్తులు తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఫిల్టర్ బెడ్ శుభ్రం

తాడేపల్లిరూరల్: వాటర్ ట్యాంక్‌లు, ఫిల్టర్ బెడ్‌ల క్లీనింగ్ కార్యక్రమం ఆదివారం చేపట్టారు. అన్ని శివారు ప్రాంతంలో వాటర్ పైపు లైన్లు వాల్వ్ తొలగించి పైపులైన్లు కూడా క్లీనింగ్ చేస్తున్నట్లు సిబ్బంది తెలిపారు.

తైక్వాండోలో స్వర్ణాలు

తెనాలిఅర్బన్: ఇండియా తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్రస్థాయి తైక్వాండో చాంపియన్ షిప్‌లో తెనాలి కేఎస్ఆర్ తైక్వాండో అకాడమి విద్యార్థులకు నాలుగు బంగారు, నాలుగు వెండి, ఐదు కాంస్య పతకాలు లభించాయని కోచ్ కొక్కిలిగడ్డ శ్రీనివాసరావు తెలిపారు. వీటిని విశాఖపట్నంలో ఈ నెల రెండు నుంచి నాలుగు వరకు నిర్వహించినట్లు చెప్పారు. పతకాలు సాధించిన విద్యార్థులను ఆదివారం అకాడమీలో మున్సిపల్ వైస్‌చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, కౌన్సిలర్ కుర్రా సుజాత, సీనియర్ కోచ్ పోలయ్య అభినందించారు.

వ్యక్తి అదృశ్యం

గుంటూరు ఈస్ట్: వ్యక్తి అదృశ్యంపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేసారు. శివరామనగర్ 12వ లైనుకు చెందిన మన్నం రమేష్ (55) ఈ నెల 10న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. అతని భార్య సంతోషం భర్త ఆచూకీ కోసం వెతికి, కనిపించకుండా పోయినట్లు నిర్ధారించుకుని ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తిపై ముగ్గురి దాడి
ముగ్గురు వ్యక్తులు వ్యక్తిపై దాడి చేసిన ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. వికలాంగుల కాలనీకి చెందిన షేక్ మస్తాన్‌వలి ఆదివారం కృష్ణబాబు కాలనీకి వెళ్లాడు. ఈ సమయంలో అకారణంగా ముగ్గురు వ్యక్తులు బీరు బాటిల్, చేతులు, కాళ్లతో మస్తాన్ వలిపై దాడి చేసి గాయపరిచారు. అతడి ఫిర్యాదు మేరకు ఆదివారం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పదస్థితిలో వృద్ధుడి మృతి
అనుమానాస్పదస్థితిలో వృద్ధుడి మృతి చెందిన సంఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. బృందావన్ గార్డెన్స్ 1వ లైనులో నివసించే మన్నవ వెంకట్రావు ఈ నెల 15న మృతి చెందాడు. శరీరంపై గాయాలున్నాయని బంధువులు ఆరోపించడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు.

భర్త మృతిపై ఫిర్యాదు
భర్త మరణంపై భార్య ఫిర్యాదు మేరకు అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. భారత్‌పేటకు చెందిన మీసాల శ్రీనివాసరావు (55) ఈ నెల 16న విధుల నిమిత్తం ఇంట్లోంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. అయితే, అతడి మృతదేహాన్ని భార్య ఉషారాణి మార్చురీలో గుర్తించింది. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు అనుమానాస్పద మృతిగా ఆదివారం కేసు నమోదు చేశారు.

ముగ్గురి అరెస్టు..
డబ్బులు తీసుకుని ఒకరికి బదులుగా జీఆర్ఈ, టోఫెల్ పరీక్ష రాస్తున్న ముగ్గురు వ్యక్తులపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రకాశం జిల్లాకు చెందిన విఘ్నేష్ , నెల్లూరు జిల్లాకు చెందిన ముకేష్, గుంటూరు పట్టాభిపురానికి చెందిన గోపిరెడ్డి జీఆర్ఈ, టోఫెల్ పరీక్షలు రాసి పాస్ చేయిస్తామని ఒక్కో విద్యార్థి నుంచి రూ. 40వేలు తీసుకున్నారు. ఆదివారం అరండల్‌పేటలోని ఓ లాడ్జిలో ముగ్గురు పరీక్ష ఆన్‌లైన్‌లో రాస్తుండగా పోలీసులు దాడి చేశారు. ముగ్గురిని అదుపులోకి తీసుకుని ఏడుగురు విద్యార్థుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సచివాలయాలు.. సేవా నిలయాలు

- ఇళ్ల వద్దకే అన్ని ప్రభుత్వ సేవలు
- హర్షం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు

మంగళగిరి: గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం తీసుకురావాలన్న ఆలోచనతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ/వార్డు సచివాలయ వ్యవస్థ ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ప్రతి రెండు వేల జనాభాకు ఒక సచివాలయాన్ని ఏర్పాటు చేశారు. సచివాలయాలలో అన్ని ప్రభుత్వ శాఖల విభాగాలను ఏర్పాటు చేశారు. ప్రజలకు అవసరమైన ప్రభుత్వ సేవలన్నిటిని అందించేందుకు సౌకర్యాలు కల్పించారు. ప్రజలకు ఏ అవసరమొచ్చినా సచివాలయాలలోనే సేవలు పొందేలా తీర్చిదిద్దారు. దీంతో సచివాలయాలకు దేశంలో మంచి పేరు ప్రతిష్టలు వచ్చాయి. సచివాలయాలు ప్రజలకు సేవా నిలయాలుగా మారాయి.

ఇళ్ల ముంగిటకే సేవలు
సచివాలయాల ఏర్పాటుతో ఇళ్ల ముంగిటికే పాలన అనే నినాదం నిజమైంది. గత పాలకులు ఎప్పుడో ఒక సారి వచ్చి ఇంటి వద్దకే పాలన అందిస్తున్నామని గొప్పలు చెప్పుకునే వారు కానీ క్షేత్రస్థాయిలో ఎక్కడా జరగలేదు. జగనన్న ప్రభుత్వం పక్కాగా ఇంటి వద్దకు పాలన అందిస్తుంది. వలంటీర్ వ్యవస్థ ద్వారా పింఛన్, రేషన్, ఇతర ఏ పథకమైనా నేరుగా ఇంటివద్దకే పంపిస్తోంది.



బాప్టిస్ట్‌పేటలోని గుర్రం జాషువా భవనంలో ఏర్పాటు చేసిన గ్రామ సచివాలయాలు

ప్రజలు ఈ వ్యవస్థకు జేజేలు పలుకుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వేల సంఖ్యలో సచివాలయాలు ఏర్పాటు చేయాలంటే వేల కోట్లు ఖర్చుతో కూడుకున్న పని అయినా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి రెండు వేల జనాభాకు ఒక సచివాలయాన్ని నిర్మించారు. సచివాలయాలలో వసతులతోపాటు ఉద్యోగులను నియమించారు. సీఎం జగన్ తీసుకున్న నిర్ణయం సాహసోపేతమని ప్రజలు అభినందించడంతో పాటు తమకు ఇళ్ల వద్దనే అందుతున్న సేవల పట్ల కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

సచివాలయాలలో సేవలు..
సచివాలయాలలో ప్రభుత్వానికి సంబంధించి వందల రకాల సేవలు అందుతున్నాయి. ముఖ్యంగా నవరత్నాలకు సంబంధించి పింఛన్, రేషన్, చేదోడు, చేయూత, అందరికి ఇళ్ళు, మ్యుటేషన్, ఇళ్ళ భూముల రీసర్వే, జనన, మరణ ధృవీకరణ పత్రాలు, సీఎం కిసాన్ తదితర పథకాలను వలంటీర్ల ద్వారా నేరుగా లబ్దిదారులకు అందజేస్తున్నారు. గతంలో రేషన్ కార్డు, ఇంటిస్థలాలతో ఏ పథకం కావాలన్నా మండల కేంద్రాలకు కాళ్ళరిగేలా తిరిగాల్సి వచ్చేది. ఇప్పుడు అలాంటి ఇబ్బంది గ్రామ, వార్డు సచివాలయాలలోనే అన్ని రకాల సేవలు అందుతుండడంతో ప్రజలు సచివాలయాల పట్ల సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఒక్కో సచివాయానికి రూ 40లక్షలు కేటాయిస్తుంది. నగరంలో 65 సచివాలయాలు వుండగా దుగ్గిరాల మండలంలో 17 గ్రామాలలో 17 సచివాయాలు న్నాయి. నగరంలోని 65 సచివాలయాలలో 41 సచివాలయాలలో ప్రభుత్వ భవనాలలో కొనసాగుతుండగా 24 అద్దె భవనాలలో నడుస్తున్నాయి. దుగ్గిరాలలో 17 ప్రభుత్వ భవనాలు పంచాయతీ కార్యాలయాలలో కొనసాగుతున్నాయి.



కార్పొరేట్ ఆఫీసును తలపిస్తున్న సచివాలయం

తిరిగే పని తగ్గింది



సచివాలయాలు ఏర్పాటుచేసిన అనంతరం ప్రభుత్వ పథకాల కోసం గతంలోలాగా కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పని లేకుండా పోయింది. వలంటీర్ ఇంటికి వచ్చి పథకాలకు అర్హత ఉంటే వెంటనే దరఖాస్తు చేయిస్తున్నారు. మా ఇంట్లో పింఛన్, వైఎస్సార్ చేయూత, టిడ్కో ఇల్లు కూడా వలంటీర్ ద్వారానే వచ్చింది. ఏదైనా అవసరమైనా దగ్గరలోనే ఉండే సచివాలయానికి వెళ్తే అక్కడ వెంటనే సమస్యను పరిష్కరిస్తున్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు డబ్బు ఆదాతోపాటు కాలం వృథా కాకుండా ప్రభుత్వ పథకాలు అందుతున్నాయి.

– అకినపల్లి విజయ, మంగళగిరి

ఇంటికే పథకాలు వస్తున్నాయి



సచివాయాలు, వలంటీర్ల నియామకంతో ప్రజలకు పథకాల గురించి చాలా బాగా తెలుస్తుంది. అర్హత ఉన్న వారందరు పథకాలు అందుకుంటున్నారు. పింఛన్, రేషన్ ఇంటికే వస్తున్నాయి. వలంటీర్లు పథకాల గురించి వివరించి దరఖాస్తులు చేయించి వచ్చేలా చేస్తున్నారు. గతంలో ఏ పథకం ఎక్కడ వస్తుందో ఎవరు ఇస్తారో తెలియక కాళ్లరిగేలా తిరిగేవారు. ఇప్పుడు ఆ భయం లేకుండా నేరుగా ఇంటికే పథకాలు వస్తుండడంతో ప్రజలు సంతోషంగా ఉన్నాం.

– మురుగుడు మహాలక్ష్మి, మంగళగిరి

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

మంగళగిరి: కార్పొరేషన్ పరిధిలోని పెదవడ్లపూడి కొత్తపాలెంలో రోడ్డు విస్తరణ పనుల నిమిత్తం సోమవారం ఉదయం 9గంటల నుంచి 11.30 గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్‌శాఖ డీఈఈ అక్కల సత్యనారాయణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

ముస్లిం యువసేన ఆవిర్భావం



మంగళగిరి: నగరంలోని ముస్లిం మైనార్టీల కోసం పని చేసే అంజుమన్ సంస్థకు సంబంధించి పాలకవర్గ ఎన్నికలు త్వరలో జరుగనున్న నేపథ్యంలో ఆ సంస్థ మాజీ కార్యదర్శి ఇస్మాయిల్ నాయకత్వంలో ముస్లిం యువసేన పేరిట నూతన ప్యానల్ ఆవిర్భవించింది. ఈ మేరకు ఆదివారం గౌతమ బుద్ధారోడ్డులోని ఈద్గా ఫంక్షన్ హాల్‌లో ఆవిర్భావ సభ నిర్వహించారు. అనంతరం అంజుమన్ మాజీ కార్యదర్శి ఇస్మాయిల్ నాయకత్వంలో ఏర్పడిన నూతన ప్యానల్ ముస్లిం యువసేన పేరును ప్రకటించి జెండాను షేక్ జలీల్ ఆవిష్కరించారు. జిలానీ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో అంజుమన్ మాజీ కార్యదర్శి షేక్ అబ్దుల్ జలీల్, మాజీ కౌన్సిలర్ ముహమ్మద్ చిన ఖాసిం, అంజుమన్ మాజీ అధ్యక్షుడు షేక్ ఖాదర్‌బాబు, పాలకవర్గ డైరెక్టర్‌లు షేక్ అక్బర్ అలీ, పఠాన్ బుజ్జి, షేక్ అక్రమ్, ఖాదర్‌బాబు పాల్గొన్నారు.

త్వరలో అందుబాటులోకి కల్యాణ పుష్కరిణి

- ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే)
- దేవాదాయ శాఖ కమిషనర్, ఎమ్మెల్సీతో కలసి ప్రత్యేక పూజలు

మంగళగిరి: కల్యాణ పుష్కరిణిని త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) అన్నారు. నగరంలోని శ్రీ లక్ష్మీ నృసింహస్వామి దేవస్థానానికి చెందిన పెద కోనేరు అభివృద్ధి పనులను దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవిలతో కలసి పరిశీలించారు. తొలుత ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవస్థాన అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఈఓ కార్యాలయంలో ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ పెద కోనేరు అభివృద్ధి పనులకు కమిషనర్ రూ.కోటి నిధులు కేటాయించగా దేవస్థానం మరో రూ.50లక్షల నిధులు కేటాయించిందన్నారు. కోనేరు అభివృద్ధి కోసం ఐదుగురు సభ్యులతో కూడిన నిపుణుల కమిటీని నియమించేందుకు దేవదాయ కమిషనర్‌తో కలసి నిర్ణయించుకున్నామని తెలిపారు. మంగళగిరి కార్పొరేషన్ పరిధిలో వివిధ దేవాలయాలకు సంబంధించి ఉన్న పది ఎకరాల భూములను గత కొన్నేళ్ల క్రితం ఎల్‌ఎల్‌పీ కింద తీసుకుని సాగు చేసుకున్న కొందరు రైతులు అవి మా భూములేనంటూ న్యాయస్థానాలను ఆశ్రయించారని చెప్పారు. అయితే న్యాయస్థానం దేవదాయ శాఖ వైపే తీర్పు చెప్పి రూ.50 కోట్ల విలువైన మూడు ఎకరాల స్థలాన్ని దేవదాయశాఖకు అప్పగించడం జరిగిందన్నారు. భవిష్యత్‌లో భూములు అన్యాక్రాంతం కాకుండా ప్రభుత్వానికే లీజుకు ఇస్తే కార్యాలయాల ఏర్పాటు ద్వారా ప్రజలకు కూడా ఉపయోగంగా ఉంటుందని చెప్పారు. ఎంటీఎంసీకి కార్యాలయం లేకపోవడం వలన పాత మున్సిపల్ భవనంలోనే అధికారులు, సిబ్బంది విధులు నిర్వహించాల్సి వస్తుందని, భూమిని కేటాయిస్తే అందులో కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకుంటారని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. చింతక్రింది కనకయ్య బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన స్థలం లీజు ముగిసినందున దానిని పొడిగించడం జరిగిందని, అందులో కొంత స్థలంలో భక్తుల వాహనాల పార్కింగ్‌కు కేటాయించాలని నిర్ణయించినట్లు తెలిపారు. మాడ వీధుల ఏర్పాటుకు సుమారు రూ.12 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో దేవస్థాన ఈఓ అన్నపురెడ్డి రామకోటిరెడ్డి పాల్గొన్నారు.



డొంక రోడ్డు పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే)



పెనుమాకలో కొత్తగా నిర్మించే బీటీ రోడ్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆర్కే

తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి
కార్పొరేషన్ పరిధిలో తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) తెలిపారు. ఆదివారం నగర పాలక సంస్థ అధికారులతో కలసి అభివృద్ధి పనులు పరిశీలించారు. గుంటూరు చానల్ వద్ద ఉన్న పంప్ హౌస్‌ను పరిశీలించారు. ప్రస్తుత వేసవి నేపథ్యంలో గుంటూరు చానల్‌లో తాగునీటి లెవెల్ తగ్గడంతో గుంటూరు కెనాల్ నుంచి తీసుకునేందుకు జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డితో ఎమ్మెల్యే ఆర్కే ఫోన్‌లో మాట్లాడారు. వీలైనంత త్వరలోనే కార్పొరేషన్ పరిధిలో తాగునీటి ఇబ్బందులు లేకుండా తగు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ శ్రీనివాసరెడ్డి, డీఈ కృష్ణారెడ్డి, ఏఈ కిషోర్ తదితరులు పాల్గొన్నారు. నూతక్కి నుంచి మెల్లెంపూడి మీదుగా కేఎల్‌యూ కట్ట వరకు సుమారు 2.5 కిలోమీటర్ల పొడవుతో సుమారు రూ.2.20 కోట్లతో నిర్మించిన బీటీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎస్ఈ శ్రీనివాసరెడ్డి, డీఈ కృష్ణారెడ్డి, ఏఈ కిషోర్ పాల్గొన్నారు.

డొంకరోడ్ల పరిశీలన
తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్‌లో పంటపొలాల్లోని డొంక రోడ్లను శాసనసభ్యులు ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) ఆదివారం పర్యటించారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా అన్నదాతల కోసం ప్రతి ఒక్క డొంకరోడ్డు నిర్మాణం చేపడుతున్నామని, వేర్వేరు ప్రాంతాలను కలుపుతూ ప్రజల రాకపోకలతో పాటు రైతులకు ఉపయోగపడే డొంక రోడ్లను బీటీ రోడ్‌లుగా మారుస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే మెల్లెంపూడి నుంచి నూతక్కి వెళ్లే రోడ్డు నిర్మాణ పనులు పూర్తయ్యాయని, మెల్లెంపూడి నుంచి రేవేంద్రపాడు వెళ్లే కరకట్టను నిర్మించామని చెప్పారు. తెనాలి నియోజకవర్గం నుంచి ప్రజలు విజయవాడ వెళ్లేందుకు రేవేంద్రపాడు నుంచి సీతానగరం వరకు డబుల్ రోడ్ నిర్మాణ పనులు చేపట్టామని, బకింగ్‌హామ్ కెనాల్‌పై రేవేంద్రపాడు వద్ద కొత్త బ్రిడ్జి ప్రతిపాదనలు పంపామని, భారీ నీటి పారుదల శాఖ నుంచి అనుమతులు రాగానే బ్రిడ్జి నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ రహదారి పూర్తి అయితే తెనాలి నుంచి విజయవాడ వెళ్లేవారికి 10 కిలోమీటర్ల దూరం తగ్గుతుందని తెలిపారు. పెనుమాక నుంచి కృష్ణాయపాలెం, దుగ్గిరాల మండలంలోని మోరంపూడి డొంకను బీటీరోడ్ నిర్మాణం చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో కార్పొరేషన్ డి.ఇ. కృష్ణారెడ్డి, ఎ.ఇ.లు ప్రవీణ్, కిషోర్, వైఎస్సార్ సీపీ నాయకులు దామేష్‌రెడ్డి, బొక్కా నాని, భుజంగరావు, రాజారెడ్డి పాల్గొన్నారు.

ఆర్యవైశ్య విద్యార్థినులకు ఉపకార వేతనాలు

తెనాలి: ఆర్యవైశ్య విద్యార్థినులకు 2022–23 విద్యాసంవత్సరంలో ఇంటర్మీడియెట్‌లో 925 మార్కులుపైన, డిగ్రీ కోర్సుల్లో 80 శాతం పైగా మార్కులు సాధించిన ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున ఉపకార వేతనం అందజేయనున్నట్లు వైశ్య విద్యానిధి కమిటీ కార్యదర్శి పెండేల వెంకట్రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత కలిగిన ఆర్యవైశ్య విద్యార్థినులు సంబంధిత మార్కుల జాబితా జిరాక్స్, ఆధార్ కార్డుతో సహా ఈనెల 30వ తేదీలోగా సంస్థ కార్యదర్శికి దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

హాస్టల్‌లో చేరేందుకు దరఖాస్తులు
పట్టణ, పరిసరాల్లోని కాలేజీల్లో చదువుకునే ఆర్య వైశ్య విద్యార్థులకు ఉచిత వసతి, భోజన సదుపాయాలను స్థానిక గంగానమ్మపేటలోని శ్రీకన్యకాపరమేశ్వరి వైశ్యవిద్యానిధి కమిటీ హాస్టలులో కల్పిస్తామని సంస్థ కార్యదర్శి పెండేల వెంకట్రావు తెలిపారు. ఇంటర్ నుంచి పీజీ, ఇంజినీరింగ్ చదివే విద్యార్థులకు ఉచిత వసతి కోసం దరఖాస్తులు కమిటీ కార్యాలయంలో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. అవసరమైన ఆర్యవైశ్య విద్యార్థులు ఉదయం 10 గంటల్నుంచి సాయంత్రం 5 గంటలలోపు దరఖాస్తులను తీసుకుని పూరించి అందజేయాలని కోరారు. ముందుగా వచ్చిన వంద మందికి అవకాశం ఉందని చెప్పారు. వివరాలకు : 94402 58574 సంప్రదించాలని కోరారు.

మహాప్రస్థానానికి రూ.1.75 లక్షల విరాళం

తెనాలి: పట్టణ పాండురంగపేటలోని మహాప్రస్థానంలో నూతనంగా నిర్మిస్తున్న గ్యాస్ చాంబర్‌కు అవసరమైన షెడ్డు నిర్మాణానికి శనివారం ఇద్దరు దాతలు రూ.1.75 లక్షలను విరాళంగా ఇచ్చారు. పరుచూరి సుధాకర్‌రావు రూ.లక్ష, పాట్లూరి శివసుబ్రహ్మణ్యం రూ.75 వేల చొప్పున విరాళాలను మహాప్రస్థాన సేవాసమితి అధ్యక్షుడు ఢాకా సాంబిరెడ్డి, ప్రధాన కార్యదర్శి జెట్టి శివరామకృష్ణప్రసాద్‌కు అందజేశారు. గతంలో చెప్పినట్టుగానే గ్యాస్ ఆధారిత చాంబర్‌ను, మార్చురీ రూమ్ నిర్మాణాలను అతి త్వరలోనే పూర్తిచేస్తామని శివరామకృష్ణప్రసాద్ వెల్లడించారు. సాధ్యమైనంతవరకు జులై నెలలో అందుబాటులోకి తీసుకొస్తామని చెప్పారు. వీరితో తుమ్మల బాపయ్యచౌదరి, చదలవాడ శంకరప్రసాద్, రావూరి శివశంకరరావు ఉన్నారు.



విరాళం అందజేస్తున్న దాతలు

యానాదులకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలి

నెహ్రూనగర్: యానాదులకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించి వారు అన్ని రంగాల్లో రాణించే విధంగా కృషి చేయాలని యానాదుల పొలిటికల్ ఫోరం రాష్ట్ర కన్వీనర్ కె.సి.పెంచలయ్య ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. యానాదుల పొలిటికల్ ఫోరం రాష్ట్ర స్థాయి రౌండ్ టేబుల్ సమావేశాన్ని ఆదివారం అంబేడ్కర్ భవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా పెంచలయ్య మాట్లాడుతూ యానాదులకు ఎమ్మెల్సీ, ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరారు. ఎస్టీ కమిషన్ చైర్మన్ పదవిని యానాదులకు కేటాయించాలన్నారు. యానాదులు అధికంగా ఉన్న కోవూరు ఎమ్మెల్యే సీటును వారికే కేటాయించాలని పలు డిమాండ్లతో ఆగస్టులో విజయవాడ కేంద్రంగా లక్ష మందితో యానాది గర్జన నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఫోరం నాయకులు మేకల శ్రీనివాస చక్రవర్తి, యందేటి వెంకట సుబ్బయ్య, చేవూరు సుబ్బారావు, చెంబేటి ఉష, జున్ను కల్యాణి, బాపట్ల బ్రహ్మయ్య, కొమరగిరి సూరిబాబు, రాచగిరి మధు, చౌటూరు రమేష్, తలపల సాంబయ్య పాల్గొన్నారు.



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న పెంచలయ్య

అవోపా సామాజిక సేవలు అభినందనీయం

గుంటూరు ఎడ్యుకేషన్: సమాజంలో పేద వర్గాల సంక్షేమం కోసం అవోపా చేస్తున్న సేవలు అభినందనీయమని పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ పేర్కొన్నారు. అరండల్‌పేటలోని ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ (అవోపా) ఆధ్వర్యంలో ఆదివారం పేదలు, వృద్ధులకు నెలవారీ పెన్షన్లు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే గిరిధర్ మాట్లాడుతూ అవోపా తరఫున నెలకు రూ.400 చొప్పున 100 మందికి పెన్షన్లు ఇవ్వడం అభినందనీయమని తెలిపారు. ఈ సందర్భంగా వాసవీ విద్యానిధి కమిటీ అధ్యక్షుడు పొట్టి సుబ్రహ్మణ్యంతో పాటు టీజేపీఎస్ కళాశాలకు నూతన కరస్పాండెంట్‌గా ఎన్నికైన అవోపా సభ్యులు కేవీ బ్రహ్మం, కోశాధికారి వడకట్ల కృష్ణానందంను సత్కరించారు. అవోపా రాష్ట్ర అధ్యక్షుడు తటవర్తి రాంబాబు మాట్లాడుతూ అవోపా ఎడ్యుకేషనల్ ట్రస్టు ద్వారా వచ్చే నెలలో పేద విద్యార్థులకు ఉపకార వేతనాల పంపిణీతో పాటు సివిల్స్‌కు సన్నద్ధమయ్యే విద్యార్థుల్ని దత్తత తీసుకుని చదివిస్తామని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ రామలింగేశ్వరరావు, అవోపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగేశ్వరరావు, కార్యదర్శి రాధాకృష్ణయ్య, కోశాధికారి మహంకాళి శ్రీనివాసరావు, మట్టుపల్లి రవికుమార్, గీతామందిరం మాజీ చైర్మన్ అశోక్, సభ్యులు పాల్గొన్నారు.



వృద్ధురాలికి పెన్షన్ అందజేస్తున్న ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్, అవోపా ప్రతినిధులు

జూద స్థావరాలపై దాడులు

ప్రత్తిపాడు: రెండు గ్రామాల్లోని రహస్య జూద స్థావరాలపై పోలీసులు మెరుపు దాడులు చేసి, పన్నెండు మంది జూదరులను అరెస్టు చేశారు. ప్రత్తిపాడు ఎస్ఐ డి.రవీంద్రబాబు వివరాల మేరకు.. పెద గొట్టిపాడులో పేకాట ఆడుతున్నారన్న సమాచారం స్పెషల్ బ్రాంచ్ తో పాటు ఎస్ఐకు సమాచారం అందింది. దీంతో ఎస్ఐ తన సిబ్బందితో కలిసి దాడి చేసి పేకాట ఆడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకొన్నారు. వారి నుంచి రూ.15,010 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రత్తిపాడు శివారులో..
ప్రత్తిపాడులోని శివారులో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో ఎస్ఐ రవీంద్రబాబు జూద స్థావరంపై దాడి చేసి ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.2,830 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు రవీంద్ర బాబు తెలిపారు.

'రంగు రంగుల కవిత్వం' పుస్తకావిష్కరణ

పాత గుంటూరు: బృందావన్ గార్డెన్స్ అన్నమయ్య గ్రంథాలయ ప్రాంగణంలో ఆదివారం అనిల్ బత్తుల, గాలి నాసరరెడ్డి సంపాదకత్వంలో వెలువడిన 'రంగుల రంగుల కవిత్వం' పుస్తకాన్ని అన్నమయ్య గ్రంథాలయ వ్యవస్థాపకులు లంకా సూర్యనారాయణ ఆవిష్కరించారు. ప్రముఖ కథా రచయిత కాట్రగడ్డ దయానంద్ సభకు అధ్యక్షత వహించి మాట్లాడారు. మరుగున పడుతున్న కవిత్వాన్ని పునరుద్ధరించే ప్రక్రియలో గ్రంథాలయాలు ఉపయోగపడుతున్నాయని తెలిపారు. మూల కవితలను సూచిస్తూ, అనువాదాలు ఏరీతిగా సాగాయో కందిమళ్ల శివప్రసాద్ వివరించారు. ప్రపంచ కవులందరి ఆలోచనా దృక్పథం ఒకేరీతిలో సాగుతుందని, అనువాదాల్ని పరిశీలిస్తే స్త్రీ అర్థమవుతుందని రవికృష్ణ అభిప్రాయం వ్యక్తం చేశారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సూర్యనారాయణ

గంజాయి విక్రయిస్తున్న మహిళ అరెస్టు

నగరంపాలెం: గంజాయి విక్రయిస్తున్న మహిళను అరెస్టు చేసినట్లు ఎస్ఈబీ (సెబ్) గుంటూరు–1 స్టేషన్ సీఐ రమేష్ తెలిపారు. ఐపీడీ కాలనీ 9వ వీధిలోని ఓ ఇంట్లో ఆదివారం తనిఖీలు నిర్వహించినట్లు చెప్పారు. ఈ క్రమంలో రూ.2,500 విలువ చేసే 340 గ్రాముల డ్రై గంజాయిని స్వాధీనం చేసుకుని, కె.కోటేశ్వరిని అరెస్టు చేసినట్లు సీఐ పేర్కొన్నారు. రెండు నెలలుగా ఆమె విక్రయాలు చేస్తుండగా, ఓ వ్యక్తి వద్ద గంజాయి కొనుగోలు చేసి విక్రయిస్తున్నట్లు విచారణలో తెలిసిందని వివరించారు.

అలరించిన సంగీత విభావరి



పాత గుంటూరు: రాజాగారి తోటలోని వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఏకే కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకులు అమానుల్లా ఖాన్ ఆధ్వర్యంలో గాన గంధర్వుడు ఎస్పీ బాలు జయంతి పురస్కరించుకుని ఆదివారం స్వరాభిషేకం పేరున నిర్వహించిన సినీ సంగీత విభావరి ప్రేక్షకుల్ని అలరించింది. గాయకులు రసూల్, హేమామాలిని, లలిత్‌బాబు, మహమ్మద్ ఖాజా, శివలీల, జరీనా, ప్రజ్ఞ పలు చిత్రాల్లోని పాటల్ని ఆలపించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ రాయపాటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

వృద్ధులు, దివ్యాంగులకు నిత్యావసరాల పంపిణీ

నగరంపాలెం: ప్రతి ఒక్కరూ వృద్ధుల్ని ఆదుకునేందుకు ముందుకురావాలని గిరిధారి మిత్ర మండలి అధ్యక్షుడు బవిరిశెట్టి శ్రీనివాసరావు కోరారు. కొత్తపేట సోమువారివీధిలోని మండలి కార్యాలయంలో ఆదివారం వృద్ధులు, దివ్యాంగులకు ఉచితంగా బియ్యం, నిత్యావసర వస్తువుల కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో దాతలు శింగంశెట్టి సాంబశివరావు, వీరాంజనేయులు, మండలి కార్యదర్శి పలకలూరి శివరావు, సభ్యులు పి.వి.సంజీవరావు, గార్లపాటి రోశయ్య, మాచర్ల ఉపేంద్ర, డి.రాజశేఖర్ పాల్గొన్నారు.

నేడు నగరపాలక సంస్థలో 'స్పందన'

నెహ్రూనగర్: ప్రజల నుంచి స్థానిక సమస్యలపై అర్జీలు స్వీకరించే స్పందన కార్యక్రమాన్ని సోమవారం నగరపాలక సంస్థలోని కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించనున్నట్లు కమిషనర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. ఉదయం 8.30 గంటలకే రిజిస్ట్రేషన్ ప్రక్రియ జరుగుతుందని పేర్కొన్నారు. ప్రతిరోజూ సచివాలయాల్లో మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు స్పందన నిర్వహిస్తారన్నారు. అక్కడ పరిష్కారం కాని సమస్యలపై నేరుగా అర్జీలు అందజేయవచ్చని కమిషనర్ తెలిపారు.